సాక్షి మహబూబాబాద్

ఆదివారం । 25 । మే । 2025



ఏడు కిలోమీటర్ల దూరంగా..

కాళేశ్వరం సరస్వతి పుష్కరాల సందర్భంగా శనివారం భక్తులు అధికంగా తరలివచ్చారు. సుమారు 7 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ త్రివేణి సంగమానికి వెళ్లారు. - 8లో▸



సైబర్ మోసం

క్రెడిట్ కార్డులు ఇప్పిస్తే కమీషన్ ఇస్తామని మాటలు విన్న ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల చేతిలో రూ.1.31లక్షలు పోగొట్టుకున్నాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోడ్డు సదుపాయం కల్పించాలి

వీసీలో మంత్రి సీతక్క

మహబూబాబాద్: జిల్లాలోని కొత్తగూడ మండలం నుంచి దుబ్బతండాకు రోడ్డు సదుపాయం కల్పించాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల అటవీ సమస్యలు, పర్యావరణ తదితర వాటిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రులు వీసీ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క మాట్లాడారు. వీసీలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ కె.వీర బ్రహ్మచారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యూనిఫాం అందజేతకు సిద్ధం



మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం అందించేందుకు సిద్ధం చేస్తున్నామని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి మధుసూదన్ రాజు అన్నారు. మహబూబాబాద్ మండలంలోని లక్ష్మీపురం (బి) జీపీ పరిధిలోని జిల్లెళ్లగూడెం గ్రామంలో స్కూల్ యూనిఫాం కుట్టు శిక్షణ కేంద్రాన్ని డీఆర్డీఓ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ యూనిఫాం కుట్టు పనులు ఎంత వరకు పూర్తి అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. త్వరగా స్కూల్ యూనిఫాం కుట్టు పనులు పూర్తిచేసి పాఠశాలలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం తిలక్, సీసీ రూపాదేవి, వీఓఏ శశికళ, కుట్టు శిక్షణ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

గార్ల రైల్వేగేటు ఓపెన్



గార్ల: గార్ల- డోర్నకల్ మధ్య గల రైల్వేగేటును శనివారం రైల్వే ఉన్నతాధికారులు ఓపెన్ చేశారు. గార్ల నుంచి డోర్నకల్ మధ్యలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ కాల్వ రైల్వే ట్రాక్ కింద నుంచి తీస్తున్నందున గత 2 నెలల నుంచి రైల్వే గేటును రైల్వే అధికారులు మూసివేశారు. దీంతో ఖమ్మం నుంచి గార్లకు వచ్చే వాహనదారులు, ఆర్టీసీ ప్రయాణికులు బుద్దారం నుంచి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కెనాల్ కోసం పక్కనే ఆర్అండ్‌బీ రహదారి తవ్వడంతో కాంట్రాక్టర్ ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయడంతో రైల్వే అధికారులు రైల్వేగేటును ఓపెన్ చేశారు. దీంతో రెండు మండలాల ప్రజలకు ఇబ్బందులు తొలగినట్లయింది. రైల్వే ఉన్నతాధికారులు డీఎస్ దినకరన్, ఏఎస్ రమేష్‌బాబు, ఐఓడబ్ల్యూ అఖిల్, రైల్వేబోర్డు కమిటీ సభ్యులు ఖాదర్‌బాబా, జర్పుల లచ్చిరాం నాయక్‌లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 2017 సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన నిరుద్యోగ విద్యార్థుల నుంచి ఉన్నతి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాక్విలిన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యంపై 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 25 సంవత్సరాల మధ్యగల వారు అర్హులన్నారు. ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు పంపాలన్నారు. వివరాలకు 9704550189 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

రైళ్ల రద్దుతో ఇబ్బందులు

కేసముద్రం: మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో థర్డ్‌లైన్ అనుసంధాన పనుల్లో భాగంగా సింగరేణి, శాతవాహన, గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసి, కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలును మాత్రమే నడుపుతున్నారు. దీంతో కేసముద్రం రైల్వేస్టేషన్ శనివారం కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని డోర్నకల్, గార్ల, గుండ్రాతిమడుగు, మహబూబాబాద్, తాళ్లపూసపల్లి, కేసముద్రం రైల్వే స్టేషన్‌లలో కాకతీయ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఉండటం, ఉదయం అప్‌లైన్‌లో ప్రయాణించే ప్రయాణికులు ఆయా రైల్వేస్టేషన్‌లలో ఎక్కడంతో బోగీలన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఈ క్రమంలో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులంతా రైలు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరికొందరు ప్లాట్‌ఫాంపైనే ఉన్నారు. అలాగే పలు రైళ్లకు కేసముద్రం రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఉండటంతో మహబూబా బాద్‌లో దిగాల్సిన ప్రయాణికులు కేసముద్రంలో దిగి బస్సులు, ఇతర వాహనాల్లో తమ గమ్యస్థానానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

పుష్కర స్నానం.. జన్మ పునీతం!



కాళేశ్వర త్రివేణీ సంగమం.. పుష్కరాల పర్వం .. పుణ్యస్నానాలతో భక్తులు పునీతం.. సరస్వతీ పుష్కరాలకు జనం పోటెత్తారు. నదీ మాతకు నమస్కరించి ప్రత్యేక పూజలు చేశారు. వీకెండ్ కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వరుణ్ణి దర్శించుకున్నారు. శనివారం సైతం రెండు లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

- మరిన్ని ఫొటోలు, వివరాలు 8లో▸

పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు





నదిలో దీపం వదులుతున్న భక్తులు



తియ్యని జ్ఞాపకం : ఎడ్లబండిలో సెల్ఫీ తీసుకుంటూ..

'అంతిమ' రాగం.. భావోద్వేగం!

భావోద్వేగానికి గురై కన్నీరు పెడుతున్న బంధువులు (ఫైల్)



ఆఖరి మజిలీలో బంధం, బంధుగణాన్ని కదిలిస్తున్న జానపదాలు

- ఇటీవల మారిన అంతిమ యాత్ర తీరు
- జ్ఞాపకాలు గుర్తు చేస్తూ కన్నీళ్లు పెట్టిస్తున్న పాటలు
- కట్టిపడేస్తున్న డప్పు కళాబృందాల ప్రదర్శన

'తోడుగా మాతోదుండీ.. నీడగా మాతో నడిచి నువ్వెక్కాడెల్లినావు కొమురయ్యా.. నీ జ్ఞాపకాలూ మరువామయ్యా కొమురయ్యా.. కొడుకునెట్లా మరిసినావే కొమురయ్యా.. నీ బిడ్డనెట్లా మరిసినావే కొమురయ్యా.. బలగాన్నీ మరిసినావే కొమురయ్యా' అంటూ బలగం సినిమాలో పాడిన పాట అందరినీ కంటతడి పెట్టించిన విషయం తెలిసిందే. ఆఖరి మజిలీలో చనిపోయిన వ్యక్తితో కుటుంబానికి, బంధుగణానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసే పాటలు పాడడం ఇప్పుడు ఓరుగల్లులో ఆనవాయితీగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా డప్పు కళాకారుల రాగం.. భావోద్వేగాన్ని పలికిస్తోంది. అదే ఈవారం 'సాక్షి' ప్రత్యేకం!

- సాక్షి, వరంగల్

ఇన్నిరోజులు కలిసి ఉండి.. ఒక్కసారిగా కుటుంబంలో ఒకరు దూరమైతే కుటుంబ సభ్యులు తట్టుకోలేరు. వారి జ్ఞాపకాలు వెంటాడతాయి. వారితో ఉన్న అనుబంధాలు మదిలో మెదులుతాయి. ఇన్నాళ్లూ అంతిమయాత్రలో డప్పుచప్పుళ్లు, అందుకు అనుగుణంగా స్టెప్పులు వేసేవారు. ఇప్పుడు డప్పుకళాకారుల నోటి నుంచి వస్తున్న బంధాలను పెనవేసే పాటలు భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. కుటుంబ పెద్ద మరణించినప్పుడు బలగం సినిమాలో పాడిన పాట, డప్పు కళాకారుల ప్రదర్శన ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా ఏళ్ల కిందటి సంప్రదాయం. ఇప్పుడు మరింత ట్రెండీగా మారింది.



సంగెం మండలం కొత్తగూడలో ఒకరి అంతిమ యాత్రలో పాటపాడుతున్న కళాకారులు (ఫైల్)

డప్పుచప్పుళ్లు.. పాటలు

'నేనెళ్లి పోతున్నా దూరం.. మన ఇల్లు, నీ పిల్లలు పదిలం.. మన బంధు బలగం పదిలం.. అని పైనుంచి తన ఆత్మ ద్వారా సుశీలవ్వ మనకు చెబుతున్నది' అంటూ నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన డప్పు కళా బృందం వరంగల్‌జిల్లా అనంతారంలో పాడిన పాట ఆఖరి మజిలీకి వచ్చినవారందరినీ కంటతడి పెట్టించింది. ఇలా డప్పు కళాకారులు, జానపదులు పాడుతున్న పాటలు బంధాలను బలోపేతం చేస్తున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని చాటిచెబుతున్నాయి.

సండే స్పెషల్

బలగం సినిమాకు ముందే...

15 ఏళ్ల క్రితమే చెన్నారావుపేట మండలం పాపాయ్యపేట యాకన్న బృందం అంత్యక్రియల్లో పాటలు పాడడం ప్రారంభించింది. ఆతర్వాత నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన యాకాంబరం బృందం కూడా బంధుత్వ విలువలు తెలిసేలా పాటలు పాడడం మొదలు పెట్టింది. అయితే బలగం సినిమా విడుదలైన తర్వాత ఈ డప్పు కళా బృందాలకు ముఖ్యంగా పాటలు పాడే వారికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఎవరు మరణించినా.. అప్పటికప్పుడు వారి గుణగణాలు తెలుసుకుని పాటలు అల్లుతూ పాడుతూ కళాకారులు కన్నీళ్లు పెట్టిస్తున్నారు.

నా భర్త చనిపోయినప్పుడు ఇదే పాట పాడిన



దుగ్గొండి: నా భర్త పస్తం మొగిలి చనిపోయినప్పుడు సైతం పుట్టెడు దుఃఖంలో ఉన్న నేను పాటతో ఆయనకు కన్నీటి నివాళి అర్పించాను. ఆయన నేర్పిన కళను ఆయన చివరి మజిలీకి చేరే వరకు వినిపించా.. నాతోటి కళాకారులు సైతం పాట పాడుతూ వచ్చారు. నేడు చావు సందర్భాలలో పాటలు పాడే క్రమంలో చనిపోయిన వ్యక్తికి ఉన్న పేరు ప్రతిష్టలు, సేవా గుణం, బంధువులతో బంధుత్వం తెలుసుకుని కళాకారులు పాటతో కన్నీరు పెట్టిస్తున్నారు.

- పస్తం కొంరమ్మ, బలగం ఫేమ్, దుగ్గొండి

చాలా ఏళ్ల నుంచి పాడుతున్నాం..



చాలా ఏళ్ల నుంచి మేం 12 మంది సభ్యులతో డప్పు కళాబృందం ఏర్పాటు చేసుకున్నాం. మనిషి చనిపోయిన సమయంలో వారు తన కుటుంబసభ్యులకు బాధ్యతలు అప్పగిస్తూ ఏమనుకుంటున్నారనే మాటలతో అప్పటికప్పుడు పాటలు రాసుకుని పాడతాం. మా పాటలతో పెద్ద గొడవలు ఉన్న ఫ్యామిలీలు మారిన సందర్భాలూ ఉన్నాయి. మేం పాడే పాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చాలామంది మమ్మల్ని సంప్రదించి తమ కుటుంబీకుల ఆఖరి మజిలీలో పాటలు పాడాలని అడుగుతున్నారు.

- సారపు యాకాంబరం, దీక్షకుంట, గ్రామ దప్పు కళాబృందం, నెక్కొండ

ఆదరణ పెరిగింది..



మాది చెన్నారావుపేట మండలం పాపయ్యపేట డప్పు కళా బృందం. 22 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని 14 ఏళ్ల క్రితమే ఏర్పాటు చేసుకున్నాం. ఓవైపు డప్పుచప్పుళ్లతో పాటు ఇంకోవైపు పాటలు పాడుతున్నాం. అయినా అప్పుడు పెద్దగా ఆదరణ ఉండేది కాదు. ఇటీవల చాలా మంది మా పాటలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తుండడంతో మాకు గిరాకీ పెరిగింది. ఇందుకు అనుగుణంగానే సరికొత్త చరణాలతో అప్పటికప్పుడు పాటలు రాస్తూ.. పాడుతూ బంధాలను మరింత బలోపేతం చేస్తున్నాం.

- అబ్బదాసి యాకన్న, డప్పు కళాకారుడు

నేటి జీపీఓ పరీక్షకు సర్వం సిద్ధం

- జిల్లాలో హాజరుకానున్న 152 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మహబూబాబాద్ అర్బన్: గ్రామ పాలన అధికారి పరీక్షలకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం కలెక్టర్, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు (ఆదివారం) ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి (జీపీఓ) పరీక్షకు 10,954 పోస్టులకు గాను జిల్లా నుంచి 152 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్నపత్రాలను తరలించాలన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జేఎన్‌టీయూహెచ్‌కు తరలించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిరాక్స్ షాపులు మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎ.రవీందర్ రెడ్డి, ఏఓ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబాబాద్: గ్రామ పాలన అధికారుల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ గ్రామ పరిపాలన అధికారుల పరీక్షల నిర్వాహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నాయకులకు పార్టీ బ్రోచర్ ఇస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండా నుంచి సీరోలు మండలం చిలుకొయ్యలపాడు వరకు రూ.3.75 కోట్లతో నిర్మిస్తున్న 1.8 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలోని రాకాసితండా, చిలుకొయ్యలపాడు మధ్య రోడ్డు నిర్మాణంతో రెండు నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. అనంతరం పార్టీకి చెందిన బ్రోచర్‌ను నాయకులకు అందించారు. ఈ కార్యక్రమంలో సీరోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, నాయకులు ఊడ్గుల వీరన్న, లక్ష్మీనారాయణ, బోడ రమేష్, వేల్పుల శ్రీను, బి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- కేవీకే శాస్త్రవేత్త మాలతి

కొత్తగూడ: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలని కేవీకే మల్యాల శాస్త్రవేత్త మాలతి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించుకునే విధానాలను వివరించారు. పంట మార్పిడి, పచ్చి రొట్ట ఎరువులు, పశువుల ఎరువు వాడి భూసారాన్ని పెంచుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రశీదు తప్పకుండా తీసుకోవడంతో పాటు పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రాంబాబు, ఏఓ ఉదయ్, హార్టీకల్చర్ ఆఫీసర్ శాంతిప్రియదర్శిని, ఏఈఓలు పాల్గొన్నారు.

భ్రూణహత్యలు నివారించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిరాథోడ్




మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిరాథోడ్


నెహ్రూసెంటర్: జిల్లాలో భ్రూణహత్యల నివారణకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిరాథోడ్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ చట్టం, జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ, మెడికల్ టర్మినేషన్ ప్రెగ్నెన్సీపై సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫిమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉందని, అబార్షన్ రేటు ఎక్కువగా ఉందన్నారు. ఫిమేల్ లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా లింగ నిష్పత్తి జరిగిన, అబార్షన్ చేసిన చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ జగదీశ్వర్, జీపీ నగేష్, డాక్టర్ మీనాక్షి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాహిని, కౌన్సిలర్ రమేష్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ వెంకటేష్, హెచ్ఈ కేవీ రాజు, లోక్య, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, అరుణ్, మనోహర్, అనిల్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాల విడుదల

- జిల్లాలో 85.65శాతం ఉత్తీర్ణత



జక్కుల షణ్ముక



గంజి లక్ష్మీతనుజ

విద్యారణ్యపురి: తెలంగాణలో పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్–25 ప్రవేశ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో 1,554 మంది అభ్యర్థులకు 1,331 మంది (85.65శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. హనుమకొండ జిల్లాలో పాలిటెక్నిక్ ఎంపీసీ స్ట్రీమ్‌లో బాలురు 3,374 మంది పాలిసెట్‌కు హాజరుకాగా.. వారిలో 2,742 మంది (81.27 శాతం), బాలికలు 2,875 మంది హాజరుకాగా 2,478 మంది (86.19 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. వరంగల్ జిల్లాలో బాలురు, బాలికలు కలిపి 481 మందికి 428 మంది (88.90 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ములుగు జిల్లాలో బాలురు, బాలికలు కలిపి మొత్తం 668 మందికి 551 మంది(82.49శాతం) ఉత్తీర్ణత సాధించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 824 మంది అభ్యర్థుకు 683 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత (82.89 శాతం) సాధించారు. జనగామ జిల్లాలో 1,343 మంది అభ్యర్థులకు 1,070 మంది (79.67శాతం) ఉత్తీర్ణత సాధించారు.

జిల్లాలో ఉత్తమ ర్యాంకులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన పలువురు విద్యార్థులు ఇటీవల విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. జిల్లా కేంద్రానికి చెందిన జక్కుల ఉపేందర్, కృష్ణవేణి దంపతుల కుమారుడు షణ్ముక ఎంపీసీ విభాగంలో 75, ఎంబైపీసీ విభాగంలో 83వ ర్యాంకు సాధించాడు. అలాగే గంజి వెంకటనారాయణ, జ్యోతి దంపతుల కుమార్తె లక్ష్మీతనుజ ఎంపీసీ గ్రూప్‌లో 230, ఎంబైపీసీలో 54వ రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. ఈ మేరకు ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు పలువురు అభినందించారు.

'ఆడ'నే చిదిమేస్తున్నారు!



భ్రూణహత్యల కేంద్రంగా మానుకోట

- గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు
- ఇతర జిల్లాల నుంచి ఇక్కడికే..
- వరుస సంఘటనలతో బట్టబయలు
- మొక్కుబడిగా అధికారుల తనిఖీలు
- కిందికి దిగజారిన మహిళల నిష్పత్తి

సాక్షి, మహబూబాబాద్: ఆడ, మగ ఇద్దరు ఉంటేనే సృష్టి.. వంటింటి స్థాయి నుంచి దేశ సరిహద్దుల్లో కాపలా వరకు శత్రు దేశాన్ని గడగడలాడించే శక్తియుక్తులకు భారత మహిళలు నిదర్శనమని ఇటీవల ఆపరేషన్ సిందూర్‌తో రుజువు చేశారు. ఇంత జరిగినా సమాజంలో ఆడవారంటే తక్కువ చూపు పోవడం లేదు. ఆడపిల్లలు పుడుతున్నారని తెలియగానే తల్లి గర్భంలోనే చిదిమేస్తున్న సంఘటనలు జిల్లాలో చోటుచేసుకోవడం బాధాకరం. ఇందుకు నిదర్శనం పురుషుల నిష్పత్తితో పోలిస్తే స్త్రీల నిష్పత్తి రాష్ట్రంలోనే మానుకోట కింది స్థాయికి దిగజారడం. అయితే ఈ పాపపు పనులు చేసే వారి సంఖ్య జిల్లాలో పెరిగిపోవడంతో ఇతర జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ అబార్షన్లు చేయించుకుంటున్నానే ప్రచారం జిల్లాకు తలవంపులు తెచ్చేలా ఉంది.

ఇక్కడ ఇది సహజమే..

లింగనిర్ధారణ పరీక్షలు, గర్భవిచ్చిత్తి ఇతర ప్రాంతాల్లో అబ్బో అనే విషయాలు అయితే మహబూబాబాద్ జిల్లాలో సహజమే అన్నట్లు పేరుంది. గతంలో తొర్రూరు పట్టణంలోని ఓ ఆస్పత్రిలో గర్భవిచ్ఛిత్తి చేస్తున్న విషయం బట్టబయలు కావడంతో ఆ ఆస్పత్రిని సీజ్ చేశారు. కురవి మండలంలో ఓ ఆర్ఎంపీ ఈ పాపానికి ఒడిగడుతున్న విషయంపై కేసు అయ్యింది. నెల్లికుదురు మండలంలో మొబైల్ వాహనంలో స్కానింగ్ మిషన్ తీసుకువచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తెలియడంతో చర్యలు తీసుకున్నారు. ఇటీవలి కాలంలో తొర్రూరు పట్టణంలో వరుస సంఘటనలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్ పట్టణంలో మూడు రోజుల క్రితం జరిగిన సంఘటనను అధికారులు స్వయంగా చూశారు. ముగ్గురిపై కేసు పెట్టినట్లు చెప్పారు. కానీ ఇప్పటివరకు ఆయా ఆస్పత్రులపై చర్యలు తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి. ఈ విషయాన్ని పీసీపీఎన్‌డీటీ సమావేశంలో బాధ్యులపై చర్య తీసుకోవాలని ముక్తకంఠంతో చెప్పినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల నిర్ణయం ఎలా ఉంటుందోనని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు.


మొక్కుబడిగా తనిఖీలు

మహిళల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతూ.. ప్రమాదకరంగా మారిందని జిల్లాలో లింగ నిష్పత్తి తగ్గడంపై నేషనల్ ఇనిస్టిస్యూట్ ఆఫ్ మెడికల్ కౌన్సిల్ సీరియస్‌గా పరిగణించింది. కేంద్ర బృందం జిల్లాలో పర్యటించింది. పలు ఆస్పత్రులను తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్ల నడుస్తున్నాయని హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు ప్రచారం జరిగింది. ఇంత జరిగినా జిల్లా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారి మారినప్పుడల్లా తనిఖీల పేరిట హడాహుడీ చేయడం .. ఆ తర్వాత మౌనంగా ఉండటం పరిపాటిగా మారుతుంది. ఇక్కడ వణుకుజణుకు లేకుండా భ్రూణ హత్యలు చేస్తున్న విషయం ప్రచారం కావడంతో వరంగల్, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి వచ్చి గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు చేయించుకొని పోతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

రాష్ట్రంలో చివరి స్థానం..

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో లింగ వ్యత్యాసంలో జిల్లా చివరిస్థానం(33)లో ఉంది. వెయ్యిమంది పురుషులకు గతంలో రూరల్ ఏరియాల్లో 996 మంది, అర్బన్ ఏరియాల్లో 1,035 మంది స్త్రీలు సగటున 903 మంది ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో లింగ నిష్పత్తి భారతదేశంలో 894, రాష్ట్రంలో 879 ఉండగా రాష్ట్రంలో అతి తక్కువగా మానుకోట జిల్లాలో 836 ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 60శాతానికి పైగా జనాభా గిరిజన, ఆదివాసీలు ఉండటం, అక్షరాస్యత తక్కువగా ఉండటంతో మగ సంతానం కావాలనే ఆలోచనతో ఆడ, మగ అనే పరీక్షలు గర్భంలోనే గుర్తించి గుట్టుచప్పుడు కాకుండా విచ్ఛిన్నం చేయడమే మహిళల జనాభా తగ్గుదలకు కారణమని విమర్శలు వస్తున్నాయి.

విచారణ జరుగుతోంది..



లింగనిర్ధారణ పరీక్షలు చేయడం , భ్రూణహత్యలకు చేయడం చట్టరీత్య నేరం. ఎక్కడ జరిగినా సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. మహబూబాబాద్‌లో జరిగిన సంఘటనపై కేసు నమోదు చేశారు. విచారణ జరుగుతోంది. పోలీసుల నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

- రవిరాథోడ్, జిల్లా వైద్యాధికారి

కఠినంగా శిక్షించాలి



జిల్లాలో వరుసగా భ్రూణహత్యల సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరం. ఇప్పటికే జిల్లాలో పురుషుల జనాభాతో పోలిస్తే స్త్రీ జనాభా తక్కువగా ఉంది. ఇందుకు కారణం లింగనిర్ధారణ, అబార్షన్లు. ఈ పాపపు పనికి ఒడిగడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి.

- నాగవాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్

పుష్కర స్నానం.. జన్మ పునీతం


పుష్కరుడికి నీళ్లు వదులుతున్న కుటుంబీకులు


నవరత్న మాల హారతి ఇస్తున్న కాశీ పండితులు


నదితీరంలో భక్తుల రద్దీ


పుష్కర స్నానం ఆచరించడానికి ఎడ్లబండ్లపై వస్తున్న భక్తజనం

బురద నుంచి నడిచి వస్తున్న భక్తులు



పుష్కర స్నానాలకు భారీగా భక్తజనం..
- 10వ రోజు రెండున్నర లక్షల మంది వరకు రాక
- కాశీపండితులతో నవరత్నమాల హారతి

భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈనెల 15వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా జరుగుతున్న సరస్వతీనది పుష్కరాలు పదో రోజుకు చేరుకున్నాయి. శనివారం ద్వాదశి సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. పుష్కర స్నానాలు ఆచరించి, నదీమాతకు పూజలు చేశారు. పిండప్రదాన పూజలు చేశారు. ముత్తయిదువులు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కాళేశ్వరాలయంలో శ్రీకాళేశ్వరముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. దీంతో భక్తులు క్యూలైన్‌లో బారులుదీరారు. రాత్రి వరకు భక్తులతో కాళేశ్వరాలయం రద్దీ నెలకొంది. శనివారం రెండున్నర లక్షల మంది భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా.

మూడు దిక్కుల ట్రాఫిక్ జామ్..
మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుడడంతో పార్కింగ్ స్థలాలు బురదమయంగా మారాయి. దీంతో తక్కువ విస్తీర్ణం గల పార్కింగ్ స్థలాల్లో వాహనాలు సరిపడా పట్టకపోవడంతో ట్రాఫిక్ నియంత్రణ కష్టంగా మారింది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు తరలిరావడంతో పోలీసులు అన్నారం క్రాస్ నుంచి వయా మద్దులపల్లి మీదుగా వన్ వే ఏర్పాటు చేసి వాహనాలు తరలించారు. దీంతో ఉదయం 12 నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. వాహనాలు మద్దులపల్లి సమీపంలోని బల్లాపూర్ శివారులో ఇసుక్వారీలో నిలిపారు. ఫలితంగా వాహనాదారులు కాలినడకన 7 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పుష్కరిణికి చేరుకున్నారు. తాగునీరు లేక పోలీసుల తీరుతో అసహనానికి గురయ్యారు. మంచిర్యాల వైపు నుంచి వచ్చే వాహనాలు అంతర్రాష్ట్ర వంతెన వద్ద నుంచి ట్రాఫిక్ జామ్ కొనసాగింది. మహదేవపూర్ నుంచి వచ్చే వాహనాలు మధ్యాహ్నం నుంచి వన్‌వే తీయడంతో టూ వే ద్వారా మళ్లీ తరలివచ్చాయి. భక్తులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు సరైన ప్రణాళికలు చేపట్టకపోవడం భక్తులకు శాపంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పుష్కరుడికి మొక్కుతున్న చిన్నారి

పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, ఎస్పీ..
అన్నారం నుంచి కాళేశ్వరం వరకు ట్రాఫిక్‌జామ్‌ను కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే సమీక్షించారు. పార్కింగ్ స్థలాలు, పుష్కరఘాట్, సరస్వతి ఘాట్ల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఎస్పీ పార్కింగ్ స్థలాల వద్ద సమీక్షించి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు.

పదో రోజు నవరత్నమాల హారతి..
సరస్వతిఘాట్ వద్ద శనివారం రాత్రి కాశీపండితులతో నవరత్నమాల హారతి ఘనంగా నిర్వహించారు. సరస్వతీమాత విగ్రహానికి నమస్కరించారు. ఏడుగురు పండితుల బృందం తొమ్మిది హారతులను ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు.


నదికి నమస్కరిస్తున్న భక్తులు


పుష్కరస్నానానికి వస్తున్న భక్తులు


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ


పుష్కరాలకు తమ చిన్నారులను ఎత్తుకుని వస్తున్న భక్తులు

డిగ్రీ ఇయర్‌వైజ్ పరీక్షల ఫలితాల వెల్లడి


ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ కోర్సుల (ఇయర్‌వైజ్ బ్యాక్‌లాగ్స్) మొదటి, ద్వితీయ, ఫైనలియర్ పరీక్షల ఫలితాలను శనివారం వీసీ కె.ప్రతాప్‌రెడ్డి.. రిజిస్ట్రార్ వి.రామచంద్రంతో కలిసి విడుదల చేశారు. మొత్తం 1,832మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందులో1,370మంది (74.38శాతం)ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ తెలిపారు. ఈ ఫలితాలను కేయూ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసి.ఇన్‌లో చూడొచ్చని తెలిపారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఎం. తిరుమలాదేవి, పి. వెంకటయ్య, క్యాంప్ ఆఫీసర్ ఎస్. సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టాలకు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కేయూ క్యాంపస్: కేయూ 23వ స్నాతకోత్సవం జూలై 7వ తేదీన నిర్వహించనున్నారు. పీహెచ్‌డీ పొందిన అభ్యర్థులు స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టాలు పొందాలనుకునే వారు రూ. వెయ్యి చొప్పున యూనివర్సిటీకి ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కేయూఆన్‌లైన్.కో.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ శనివారం తెలిపారు. కేయూలో 2020 జనవరి 1 నుంచి 2025 మే 31వరకు పీహెచ్‌డీ పొందిన అభ్యర్థులు 573 మంది ఉన్నారు. ఆర్ట్స్, సోషల్ సైన్స్, సైన్స్, కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ, 'లా', ఇంజనీరింగ్ కోర్సుల్లో పీహెచ్‌డీ పూర్తిచేసిన అభ్యర్థులు పట్టాలు పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కాగా,2016, 2017, 2018, 2019, 2020, 2021 సంవత్సరాల్లో వివిధ కోర్సుల్లో గోల్డ్‌మెడల్స్ సాధించిన 564 మందికి కూడా స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేస్తారన్నారు.

పెళ్లికి వెళ్లొస్తూ.. కానరాని లోకాలకు

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ
- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు


లారీ కింద కుమార్ మృతదేహం

నల్లబెల్లి : పెళ్లికి వెళ్లొస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో కానరాని లోకాలకు వెళ్లాడు. ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరు గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం నల్లబెల్లి మండలం రుద్రగూడెం శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన భూస కుమార్ (40), పెండ్లి రాజు ద్విచక్రవాహనంపై నల్లబెల్లి మండలం నాగరాజుపల్లి శివారు ఒల్లెనర్సయ్యపల్లిలో బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యారు. వేడుక పూర్తయిన అనంతరం ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మల్లంపల్లి నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న లారీ రుద్రగూడెం శివారులోని జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కుమార్ లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుకు గాయాలుకావడంతో స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

ఏడు కిలోమీటర్ల దూరంగా...


అడవిలో నుంచి నడుచుకుంటూ వస్తున్న భక్తులు


మద్దులపల్లి వరకు నిలిచిన ట్రాఫిక్


ప్రైవేట్ డీసీఎంలో భక్తులను ఎక్కిస్తున్న పోలీసులు


బస్సుల కోసం ఎదురుచూస్తున్న భక్తులు

కాళేశ్వరం పుష్కరాల పార్కింగ్ పాయింట్ ఏర్పాటు
- అక్కడి నుంచి వచ్చేందుకు భక్తుల అవస్థలు
- వాహనాలను దారి మళ్లించినా నియంత్రణ కాని ట్రాఫిక్
- నేరుగా రంగంలోకి దిగిన ఎస్పీ..

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం సర్వసతీనది పుష్కరాల నేపథ్యంలో శనివారం పదో రోజు భక్తుల వాహనాల సంఖ్య అధికంగా పెరిగింది. మహారాష్ట్ర వైపు నుంచి గోదావరిఖని, మంచిర్యాల భక్తుల సంఖ్య పెరగడంతో హనుమకొండ, కరీంనగర్, హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రైవేట్ వాహనాలను అన్నారం క్రాస్ నుంచి కాళేశ్వరానికి వన్ వేలో తరలించారు. ఉదయం 11 గంటల నుంచే సుమారు 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో మద్దులపల్లి–పుసుకుపల్లి గ్రామాల మధ్య రెండు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. వాహనాల సంఖ్య పెరగడంతో నేరుగా ఎస్పీ కిరణ్‌ఖరే బైక్‌పై తిరుగుతూ కాళేశ్వరం నుంచి పుసుకుపల్లి, మద్దులపల్లి, అన్నారం మీదా అన్నారం క్రాస్ వరకు ట్రాఫిక్ రాకపోకలు, నియంత్రణను పరిశీలిస్తూ సిబ్బంది సూచనలు చేశారు. 7కిలో మీటర్ల దూరంగా అడవిలో హోల్డింగ్ పాయింట్ ఏర్పాటు చేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడి నుంచి త్రివేణి సంగమానికి నడుకుంటూ వెళ్లారు. భక్తులను ఇబ్బందులకు చూడలేక పోలీసులు అటువైపు నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సులు, వ్యాన్‌లను ఆపి ఎక్కించి పుష్కర ఘాట్‌కు తరలించారు.

ఆటోచార్జీ ఒక్కరికి రూ.100, భక్తుల మండిపాటు..
అడవిలో పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు చేయడంతో భక్తులు అంత దూరం నడవలేక ఆటోల్లో ప్రయాణించారు. ఆటో యజమానులు ఒక్కొక్కరి నుంచి చార్జీ రూ.100 వరకు వసూళ్లు చేశారు. దీంతో భక్తులు ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు.

రోజు వర్షంతో ఇబ్బందులు..
ప్రతీ రోజు కాళేశ్వరంలో వర్షం కురుస్తుండడంతో సరస్వతి ఘాట్ నుంచి ముక్తీశ్వర ఆలయం వరకు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలు పూర్తిగా బురదమయం కావడంతో వాహనాలు పార్క్ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులకు ట్రాఫిక్ నియంత్రణ సవాల్‌గా మారింది. పుష్కర ఘాట్ సమీపంలో పార్కింగ్ స్థలాలు వినియోగంలో లేకపోవడంతో అడవిలో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేయకతప్ప లేదు.

తిరుగు ప్రయాణానికి భక్తుల అవస్థలు.. బస్సుల కోసం పడిగాపులు..
కాళేశ్వరం సరస్వతీనది పుష్కరాలకు పదో రోజు హాజరైన భక్తులు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సుల లేక ఇబ్బందులు పడ్డారు. శనివారం వేల సంఖ్యలో తరలివచ్చారు. కాళేశ్వరానికి ఉదయం 6గంటల నుంచే రద్దీ పెరిగింది. తిరుగు ప్రయాణానికి కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌కు మధ్యాహ్నం 2గంటల నుంచే అధిక సంఖ్యలో చేరుకున్నారు. హనుమకొండ, భూపాలపల్లి, మంథని, గోదావరిఖని, మంచిర్యాల బస్సుల కోసం ఎదురుచూశారు. అదనపు టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే కూర్చుకున్నారు. బస్సులు కూడా తిరగలేని పరిస్థితి ఎదురైంది. భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, అందుకు తగిన ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పలుమార్లు అధికారులను ఆదేశించారు. అయినా ఆర్టీసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోనట్లు కనిపిస్తోంది.

లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు అందజేత


రివార్డు అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు: లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టులకు శనివారం ఎస్పీ శబరీశ్ రివార్డులు అందజేశారు. మణుగూరు ఎల్ఎస్‌జీ సభ్యురాలు, ఛత్తీస్‌గఢ్‌లోని ఊసూరు పీఎస్ పరిధి మలంపేటకు చెందిన మడవి మంగిలి అలియాస్ నవ్యకు రూ. లక్ష, మిలిషీయా సభ్యుడు, ఛత్తీస్‌గఢ్‌లోని ఊసూరు పీఎస్ పరిధి కొత్తపల్లికి చెందిన దూది జయరామ్‌కు రూ. 25 వేల రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సరెండర్ పాలసీ అమలు చేస్తోందన్నారు. ఆ పాలసీ ప్రకారం లొంగిపోయిన వారికి రివార్డు, వైద్య చికిత్సతో పాటు పునరావాస చర్యలు కల్పిస్తోందన్నారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలో కలవాలని సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

నూతన విజయ డెయిరీ ఏర్పాటుకు కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


పాలు, పెరుగు ప్యాకింగ్‌లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సారయ్య, డెయిరీ చైర్మన్ అమిత్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: రూ.25 కోట్లతో నూతన విజయ డెయిరీ నిర్మాణం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులందరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ ములుగురోడ్ సమీపంలోని విజయ డెయిరీ వరంగల్ యూనిట్‌లో శనివారం నూతనంగా రూపొందించిన పాలు, పెరుగు నూతన ప్యాకింగ్ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి హాజరై కొత్త ప్యాకింగ్‌లను విడుదల చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ విజయ డెయిరీ అంటేనే నమ్మకం అన్నారు. కార్యక్రమంలో డెయిరీ జీఎంలు మల్లయ్య, మధుసూదన్‌రావు, రీజనల్ సేల్స్ మేనేజర్ ధన్‌రాజ్, డెయిరీ వరంగల్, జనగామ డిప్యూటీ డైరెక్టర్లు శ్రవణ్‌కుమార్, సత్యనారాయణ, జూనియర్ మేనేజర్ అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసం..

- రూ.1.31 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు
- క్రెడిట్ కార్డులు ఇప్పిస్తే కమీషన్ ఇస్తామని మోసం..

మహబూబాబాద్ రూరల్ : క్రెడిట్ కార్డులు ఇప్పిస్తే కమీషన్ ఇప్పిస్తామనే మాటలు విన్న ఓ వ్యక్తి.. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. రూ.1.31 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం కేసు వివరాలు వెల్లడించారు. రూరల్ పీఎస్ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జిలానీ సెల్ ఫోన్‌కు ఈనెల 5వ తేదీన ఓ మెస్సేజ్ వచ్చింది. అవతలి వ్యక్తులు క్రెడిట్ కార్డులు ఎవరికైనా అవసరం ఉంటే ఇప్పించండి మీకు కమీషన్ ఇస్తామని సమాచారం పంపించారు. నమ్మిన జిలానీ వాళ్లు పంపిన స్కానర్‌కు ఈ నెల 5వ తేదీన మొదట రూ.40 వేలు బదిలీ చేశాడు. మళ్లీ అదే రోజున ఒకసారి రూ.48 వేలు, తెల్లవారురోజున మరోసారి రూ.28 వేలు, అనంతరం రూ.15 వేలు, మొత్తం రూ.1.31 లక్షలు నగదు బదిలీ చేశాడు. రెండు మూడు రోజుల అనంతరం తనకు స్కానర్ పంపిన వ్యక్తులకు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన రాకపోవడంతో తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గుర్తించాడు. దీంతో లబోదిమంటూ అదే రోజు సైబర్ క్రైమ్ 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై దీపిక పేర్కొన్నారు.

సమగ్ర కీటక నివారణపై కేవీకేలో శిక్షణ


కేవీకేలో శాస్త్రవేత్తలతో కలిసి బెండ తోటను పరిశీలిస్తున్న డీలర్లు, ఏఈఓలు

మామునూరు: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ములుగు జిల్లాకు చెందిన ఫర్టిలైజర్ డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఖరీఫ్ పంటల్లో సమగ్ర కీటక వ్యాధి నివారణ (ఐపీడీఎం)పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ముఖ్యఅతిథిగా హాజరై ఐపీడీఎం సిద్ధాంతాలు, పద్ధతులు, రసాయనాల చట్టాలు, నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం మల్చింగ్ యూనిట్ ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. అక్కడ కూరగాయల పంటల్లో ప్రధాన కీటకాలు, వ్యాధులను గుర్తించడం, వాటి నిర్వహణ పద్ధతుల గురించి వివరించారు. జె.సాయి కిరణ్ అజోల్లా తయారీ, పశువులకు ఇచ్చే ఆహార నియమాలు, అనువైన మేత గురించి కేవీకేలోని డెమో యూనిట్లలో వివరించగా.. డాక్టర్ గణేశ్ చేపల పెంపకం, వాటి నీటి, ఆహారం, ఆరోగ్య నిర్వహణ గురించి వివరించారు. కార్యక్రమంలో డీలర్లు, ఏఈఓలు పాల్గొన్నారు.